పారిపోయిన ప్రభుత్వం

- కాంగ్రెస్ మాటల్లోనే ప్రజాస్వామ్యం
- తొలిరోజే ప్రతిపక్షాల గొంతునొక్కారు
- వివరణ ఇవ్వకుండానే వెనుదిరిగారు
- ఉద్యమకారులపై తుపాకీ ఎక్కుపెట్టారు
- అమరవీరులపై మాట్లాడే హక్కుమీకు లేదు
- బీఆర్ఎస్ హయాంలోనే కేసుల ఎత్తివేత
- కాంగ్రెస్ తీరుపై అసెంబ్లీ, మీడియా పాయింట్‌లో నిప్పులు చెరిగిన హరీశ్‌రావు

అసెంబ్లీ ముచ్చట్లు

శనివారం అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా మొదటిరోజే ప్రతిపక్షాల గొంతు నొక్కిందని, తాము అధికారంలో ఉనప్పుడు రెండో సభ్యుడు కూడా మాట్లాడేందుకు అవకాశం ఇచ్చామని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీమంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కరికి కూడా అవకాశం ఇవ్వకుండా, వివరణలు వినకుండా, కనీసం నిరసనకు కూడా అవకాశం ఇవ్వకుండా మొదటిరోజే పారిపోయిందని ఎద్దేవా చేశారు. శనివారం అసెంబ్లీలో, అనంతరం మీడియా పాయింట్‌లో హరీశ్‌రావు మాట్లాడారు. బీఆర్ఎస్‌తోపాటు, ఎంఐఎం, బీజేపీ నేతలు మాట్లాడడానికి అవకాశం ఇవ్వకుండా సభను ఏకపక్షంగా వాయిదా వేశారని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి సభలో ఎక్కువగా అబద్ధాలే మాట్లాడారని విమర్శించారు. సభలో ప్రజాస్వామ్యబద్ధంగా ఉంటామని చెప్పి.. చేతల్లో నిరంకుశత్వాన్ని ప్రదర్శించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి గంటకుపైగా మాట్లాడుతుంటే.. తాము మధ్యలో పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తినా స్పీకర్ కనీసం తమవైపు కూడా చూడలేదని, మైక్ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌ది ముమ్మాటికీ కుటుంబ నేపథ్యం

కాంగ్రెస్‌ది ముమ్మాటికీ కుటుంబ నేపథ్యమని హరీశ్‌రావు విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ గురించి మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని పేర్కొన్నారు. నాడు పీవీ చనిపోతే కనీసం చూడటానికి కూడా రాలేదని, ఢిల్లీలో ఆయనకు కనీసం గజం జాగా కూడా ఇవ్వలేదని గుర్తుచేశారు. మాజీ సీఎం కేసీఆర్.. పీవీకి ఘనంగా నివాళులు అర్పించారని, బీఆర్ఎస్ ప్రభుత్వం ఆయనకు ఘాట్ కూడా నిర్మించిందని పేర్కొన్నారు. అమరవీరులను గౌరవించిందే బీఆర్ఎస్ ప్రభుత్వమని తెలిపారు. సచివాలయానికి ఎదురుగానే అమరవీరుల స్మారకాన్ని అద్భుతంగా నిర్మించామని పేర్కొన్నారు.

రైతుల ఆదాయంపై తప్పుదోవ పట్టించారు

రైతుల ఆదాయం విషయంలోనూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను, సభను తప్పుదోవపట్టించే ప్రయత్నం చేశారని హరీశ్‌రావు పేర్కొన్నారు. నిండు సభలో రైతుల ఆదాయం తక్కువగా ఉందని ఓ తప్పుడు నివేదిక ఇచ్చారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో మిరపసాగులో తెలంగాణ నంబర్‌గా ఉందని, పత్తిలో 2వ స్థానంలో నిలిచిందని, పంటల సాగు విస్తీర్ణం పెరిగిందని చెప్పారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ప్రకారం తెలంగాణలో రైతు ఆత్మహత్యలు తగ్గినట్టు హరీశ్‌రావు చెప్పారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబించిన విధానాల వల్ల 2014లో 1348 మంది ఆత్మహత్యలు చేసుకున్నట్టు చెప్పారు. రైతుబీమా పొందిన లక్షా 19వేల మంది కూడా ఆత్మహత్యలు చేసుకున్నట్టు, అవి ప్రభుత్వ హత్యలని సభలో చెప్పడం సీఎం రేవంత్ అవగాహన రాహిత్యానికి నిదర్శనమని మండిపడ్డారు.

కాంగ్రెస్ పాల్టికి భిక్ష పెట్టిందే బీఆర్ఎస్

జీవం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీకి 2004 అసెంబ్లీ ఎన్నికల సమయంలో జీవం పోసిందే కేసీఆర్.. భిక్షపెట్టిందే బీఆర్ఎస్ పార్టీ అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఉట్టిగనే తమకు పదవులిచ్చిందని రేవంత్‌రెడ్డి మాట్లాడటం సరికాదని మండిపడ్డారు. చంద్రబాబు హయాంలో కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కని కాంగ్రెస్ పార్టీకి కేసీఆర్ జీవం పోశారన్న విషయాన్ని ఆ పార్టీ నేతలు గుర్తుంచుకోవాలని సూచించారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడానికి తాము సహకరించామని, ఆ పార్టీకి భిక్ష పెట్టామని వ్యాఖ్యానించారు.

పదవులను త్యజించిన చరిత్ర కేసీఆర్‌ది

పదవులను తృణప్రాయంగా వదులుకొన్న చరిత్ర కేసీఆర్‌దని హరీశ్ గుర్తు చేశారు. ''2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు సోనియా అధ్యక్షతన యూపీఏ పక్షాల సమావేశం జరిగింది. కేసీఆర్‌ను కేంద్ర మంత్రివర్గంలో చేరాలని సోనియా కోరారు. కామన్ మినిమం ప్రోగ్రాంలో తెలంగాణ అంశాన్ని పెడితేనే క్యాబినెట్‌లో చేరుతానని కేసీఆర్ అప్పుడు స్పష్టంచేశారు. తాను పదవుల కోసం రాలేదని, తెలంగాణ కోసమే ఢిల్లీకి వచ్చానని కేసీఆర్ చెప్పారు'' అని హరీశ్‌రావు గుర్తుచేశారు. తెలంగాణ అంశాన్ని కామన్ మినిమం ప్రోగ్రాంలో పెట్టించి, పార్లమెంట్ ఉభయ సభల్లో రాష్ట్రపతి తన ప్రసంగంలో సంప్రదింపుల ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయిస్తామని చెప్పించింది కేసీఆరేనని గుర్తుంచుకోవాలన్నారు. కేసీఆర్‌కు ఇచ్చిన షిప్పింగ్ శాఖను తమకు ఇవాలని, లేదంటే యూపీఏ నుంచి వైదొలగుతామని డీఎంకే డిమాండ్ చేస్తే కేసీఆర్ తృణప్రాయంగా ఆ పదవిని వదులుకున్నారని పేర్కొన్నారు. పదవులను గడ్డి పోచల్లా త్యజించిన చరిత్ర ఈ దేశంలో ఎవరికైనా ఉందంటే అది ఒక్క కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీదేనని స్పష్టం చేశారు. పోతిరెడ్డుపాడు విషయంలోనూ కాంగ్రెస్ అవాస్తవాలు చెబుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ క్యాబినెట్‌లో మంత్రులుగా ఉన్న బీఆర్ఎస్ నేతలు ఆరు గురం ఆరు కారణాలు చెప్పి 14 నెలలకే రాజీనామా చేశామని తెలిపారు. పోతిరెడ్డిపాడును ఆపాలని అసెంబ్లీలో తాము 45 రోజుల పాటు నిరసన వ్యక్తం చేశామని గుర్తుచేశారు. హరీశ్‌రావు వెంట మాజీ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, సబితాఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, వాకిటి సునీతాలక్ష్మారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, విజేయుడు, మాగంటి గోపీనాథ్, లాస్యనందిత, రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, బండారు లక్ష్మారెడ్డి, కాలె యాదయ్య, తెల్లం వెంకట్రావ్, వివేకానంద్‌గౌడ్, కోవ లక్ష్మి, అనిల్ జాదవ్ తదితరులు ఉన్నారు.

రేవంత్‌రెడ్డి పేరే రైఫిల్‌రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ ఉద్యమకారుల గురించి మాట్లాడే హక్కు లేదని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీ పేరే రైఫిల్‌రెడ్డి. ఆ నాడు తెలంగాణ ఉద్యమంలో తుపాకీ పట్టుకొని.. జై తెలంగాణ అని ఎవడంటడో రండి. కాల్చిపడేస్తా' అంటూ ఉద్యమకారులపై తుపాకీ గురిపెట్టారని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో తమపై ఎన్నో కేసులు నమోదయ్యాయని, ఎన్నికల అఫిడవిట్లలో వాటిని పొందుపర్చామని చెప్పారు. ఉద్యమకారులపై కేసులు ఎత్తివేసిన ఘనత తమదేనని పేర్కొన్నారు.

కౌంటర్ - ఎన్‌కౌంటర్

కేసీఆర్ ఇంటికో ఉద్యోగం ఇస్తామన్నారు: కూనంనేని సాంబశివరావు

కేసీఆర్ గారిని చూస్తే బాధేస్తున్నది. చాలా విజన్ ఉన్న నాయకుడు. ఏదైనా తలచుకుంటే చేయగలిగిన నాయకుడు. వద్దనుకుంటే చేయలేదు. అన్ని వాగ్దానాలు ఇలాగే నెరవేర్చలేకపోయారు. మూడెకరాల భూమి, డబుల్‌బెడ్రూం. ఇంటికో ఉద్యోగం వంటి హామీలు నెరవేర్చలేకపోయారు.

మేం ఇస్తామనలేదు: హరీశ్‌రావు

సీపీఐ కాంగ్రెస్‌కు మిత్రపక్షంగా, కాంగ్రెస్‌కు అనుకూలంగా మాట్లాడటం సంతోషం. మీరు కలిసే పోటీ చేశారు. ఇలా మాట్లాడటంలో తప్పులేదు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని మేమెక్కడా చెప్పలేదు. మా మ్యాని ఫెస్టోలో ఉందా? ఐ ఛాలెంజ్. ఎవరన్నా, ఎక్కడన్నా స్పీచ్‌లో మాట్లాడినట్టు, మ్యానిఫోస్టోలో పొందుపరిచినట్టు ఉంటే చూపించండి. అనవసరంగా స్వీపింగ్ రిమార్క్స్ చేయవద్దు. ఎన్నికల్లో మాట్లాడితే మాట్లాడొచ్చు కానీ, ఇలా సభలో మాట్లాడం. మేం చెప్పనిదానిని చెప్పినట్టు చెప్పడం మీ వయసుకు తగదు.

కేసీఆర్‌ను ఎంపీగా గెలిపించింది.. కేంద్రమంత్రిని చేసిందే కాంగ్రెస్: సీఎం రేవంత్‌రెడ్డి

గత పాలనలో యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్‌గా కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు అవకాశం ఇచ్చిందే కాంగ్రెస్‌పార్టీ. సింగిల్ విండో డైరెక్టర్‌గా పోటీచేసే అవకాశమిస్తే నిలబడి ఓడిపోయిందే కేసీఆర్. గత పాలనలో ఎంపీగా గెలిపించిందే కాంగ్రెస్. షిప్పింగ్..కార్మికశాఖ మంత్రిని చేసిందే కాంగ్రెస్ పార్టీ.

పదవుల కోసం పాకులాడలేదు:హరీశ్‌రావు

మేం ఏదో పదవుల కోసం పాకులాడినం అన్నట్టు సీఎం మాట్లాడడం సరికాదు. ఆ విషయానికి వస్తే రేవంత్‌రెడ్డి ఏబీవీపీలో షురువైండు.. టీఆర్ఎస్‌లో పనిచేసిండు, తెలుగుదేశంలో పోయిండు, కాంగ్రెస్‌లో పోయిండు. మరి రేపు ఏడ ఉంటడో? పార్టీలు మారిన చరిత్రలు మీకున్నాయి. మాకు అట్లాంటిది ఏం లేదు.

పోతిరెడ్డిపాడుపై ఎవరూ కొట్లాడలే.. ఎవరూ ముందుకురాలే: రేవంత్‌రెడ్డి

పోతిరెడ్డిపాడు పొక్క పెద్దగా చేసిననాడు నాయిని నర్సింహారెడ్డి గారు కడప జిల్లా ఇన్‌చార్జి మంత్రి. ఆ ఆరోజు పోతిరెడ్డిపాడు మీద కొట్లాడింది పీ జనార్దన్‌రెడ్డిగారు. పోతిరెడ్డిపాడు పొక్క పెద్దదిచేసినప్పుడు ఈ సభలో ఎవరెక్కడున్నరో అందరికీ తెలుసు. ప్రాణత్యాగాలు చేస్తామని ఎవరూ కొట్లాడలే. ఎవరూ ముందుకురాలే. సొంత పార్టీ ప్రభుత్వమున్నా.. తెలంగాణ ప్రజల హక్కులకు భంగం కలగొద్దని, కృష్ణానది జలాల్లో మా వాటా మాకు దక్కాల్సిందేనని, మేం ఒప్పుకోమని కొట్లాడిందే ఆ నాటి నాయకుడు పీజేఆర్. అంతే తప్ప వీళ్లు కాదు.

రికార్డులు బయటపెడితే తెలుస్తుంది: హరీశ్‌రావు

పోతిరెడ్డి ప్రాజెక్టుపై వీలైతే చర్చ పెట్టండి. సభ రికార్డులు బయట పెట్టండి. వీడియో పుటేజీ కూడా సభలో ఉంటది. అది కూడా బయట పెట్టండి. అన్ని విషయాలు బయట పెడితే దాని మీద నేను చర్చకు సిద్ధం. ఇదే సభలో అదే పోడియంలో నేను పద్మా రావుగౌడ్ కలిసి పోతిరెడ్డిపాడును ఆపాలని 45 రోజులు నిరసన వ్యక్తం చేశాం. కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక్కరు పీజేఆర్ మాత్రమే కొట్లాడారు. ఆ రోజు మంత్రులుగా ఉన్న చాలా మంది పెదవులు మూసుకుని ఇక్కడ కూర్చున్నారు. ఆ రోజు మాతో గొంతు కలిపింది పీజేఆర్ మాత్రమే. ఆ పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్ రెడ్డి కూడా మాతోనే ఉన్నారు.

ఎమ్మెల్యే కాకుండానే మంత్రిని చేసినం: రేవంత్‌రెడ్డి

కేసీఆర్ కుటుంబ సభ్యుడే ఈ సభలో ఉన్నారు. ఆయన్ను ఎమ్మెల్యే కాకుండానే మంత్రిని చేసి తర్వాత ఎమ్మెల్యేగా ఎన్నిక కావడానికి సహకరించిందే కాంగ్రెస్. ఏ పేరు మీరు వినొద్దని కోరుకుంటున్నారో ఆ రాజశేఖర్‌రెడ్డి మంత్రివర్గంలో గత ఆర్థిక శాఖ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యేగా ఎమ్మెల్యేగా లేకుండానే మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజశేఖర్‌రెడ్డి గారి నాయకత్వమే దేశానికి బలమైన నాయకత్వమని వారి నాయకత్వంలో పనిచేశారు.

ఆరుగురం.. ఆరు కారణాలు చెప్పి రాజీనామా చేశాం: హరీశ్‌రావు

ఆ రోజు రాజశేఖర్‌రెడ్డి క్యాబినెట్‌లో ఆరుగురు మంత్రులు ఉన్నాం. 14 నెలలకే రాజీనామా చేశాం. మేం ఆరు కారణాలు చెప్పి రాజీనామాలు చేశాం. పోతిరెడ్డిపాడు ప్రాజెక్టుకు అక్రమంగా పొక్కకొట్టి మా తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా జలాలను రాయలసీమకు తరలించడం, తెలంగాణను ముంచి ఆంధ్రాకు నీళ్లు మళ్లించే పులిచింతల ప్రాజెక్టును ఆపకపోవడం, జీవో 610 జీవో అమలు చేయడం నిర్లక్ష్యం, మా తెలంగాణ పిల్లలకు ఉద్యోగాలు దక్కే విషయంలో మాట తప్పడం, నక్సలైట్లతో చర్చల పేరిట ఫేక్ ఎన్‌కౌంటర్లు వంటి కారణాలతో రాజీనామా చేశాం.

కొత్త రేషన్‌కార్డులు, నిరుద్యోగ భృతి ఇవ్వాలి

- ఆటో కార్మికులను ఆదుకోండి
- విజన్ ఉన్న నాయకుడు కేసీఆర్
- కేంద్రం ఇవ్వాల్సిన రూ.70 వేలకోట్ల నిధులపై దృష్టిపెట్టండి: ఎమ్మెల్యే కూనంనేని

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): కొత్త రేషన్‌కార్డులు, నిరుద్యోగ భృతి ఇవ్వాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటో కార్మికుల బతుకు దుర్భరంగా మారిందని, వారిని ఆదుకోవాలని సూచించారు. శనివారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై మాట్లాడుతూ.. తెలంగాణకు కేంద్రం పదేండ్లుగా రావాల్సిన నిధులను రాబట్టడం కోసం ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు దాదాపు రూ.70 వేలకోట్లు ఉంటాయని, వాటిని తీసుకొస్తే రాష్ట్రానికి ఉపయోగపడతాయని చెప్పారు. ప్రతి జిల్లాలో ఐటీ హబ్‌లు ఏర్పాటుచేయాలని, అసంఘటిత రంగాల వారికి పింఛన్ ఇవ్వాలని సూచించారు. కేసీఆర్ విజన్ ఉన్న నాయకుడని, ఏదైనా చేయాలనుకుంటే చేసేస్తారని, వద్దనుకుంటే మాత్రం ఎవరు చెప్పినా చేయరని అన్నారు. వ్యక్తిగత దూషణలు సరికాదని, సభను హుందాగా నిర్వహించాలని సూచించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను వందశాతం అమలు చేయాలని చెప్పారు. ఒకవేళ అమలు చేయలేకపోతే, ఎందుకు చేయలేకపోయామో? బాధ్యతాయుతంగా ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో చేసిన మంచి పనులు, పథకాలు, కార్యక్రమాలను కొనసాగించాలని సూచించారు. ఈ సభలో ఎవరూ శాశ్వతం కాదని, ఓడిపోయామని బీఆర్ఎస్ బాధపడాల్సిన పనిలేదని, నిర్జీవాత్మక ప్రతిపక్ష పాత్రను పోషించాలని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ పాత్ర స్ఫూర్తిదాయకమని, అప్పట్లో కేసీఆర్‌ను ఖమ్మం జైలులో పెడితే తామంతా వెళ్లి మద్దతు తెలిపామని గుర్తుచేశారు. తెలంగాణ సుసంపన్న రాష్ట్రమని, ఆ నిధులతో ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని పేర్కొన్నారు.

పోటీ పరీక్షలు ఉర్దూలోనూ నిర్వహించాలి

- కేసీఆర్ ప్రభుత్వంలో ఉర్దూకు ప్రాధాన్యం
- కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రస్తావనే లేదు
- ఇమామ్‌లకు వేతనం 15 వేలు ఇవ్వాలి
- కాంగ్రెస్, ఎంఐఎం మధ్య పొత్తు లేదు
- ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): పోటీ పరీక్షలు ఉర్దూ భాషలో నిర్వహించాలని ఎంఐఎం శాసన సభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ కోరారు. మదరసా బోర్డు పెట్టాలని విజ్ఞప్తిచేశారు. శనివారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై అక్బరుద్దీన్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం ఉర్దూకు ప్రాధాన్యం ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు ఒవైసీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో కేసీఆర్ పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఉర్దూ ప్రస్తావనే లేదని గుర్తుచేశారు. కాంగ్రెస్, ఎంఐఎం మధ్య పొత్తులేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌కు తాము దగ్గర ఉన్నామంటే కారణం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మాత్రమేనని పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీల వల్లే ప్రజలు కాంగ్రెస్‌కు అధికారమిచ్చారని, దానిని నిలబెట్టుకోవాలని సూచించారు. ప్రభుత్వం మంచి చేస్తే ప్రశంసిస్తామని, చేయకపోతే విమర్శిస్తామని చెప్పారు. పాత బస్తీ అభివృద్ధిపై ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు అనే విషయాన్ని పదేపదే ప్రస్తావించిన కాంగ్రెస్.. మ్యానిఫెస్టోలో దానిని పెట్టలేదని అన్నారు. ఇమామ్‌లకు రూ.12 వేలు కాదని, రూ.15 వేల గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని స్వాగతిస్తున్నామని, అదే సమయంలో ఆటో డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలని కోరారు. రైతుభరోసా, గృహజ్యోతి, ఉచిత కరెంట్ వంటి అంశాలపై స్పష్టమైన విధివిధానాలను ప్రకటించాలన్నారు. ఇప్పటికే సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్రూం ఇండ్లను లబ్ధిదారులకు అందజేయాలని అన్నారు. హైదరాబాద్‌లో దుకాణాలను రాత్రి 11 గంటలలోపే మూసివేయాలని పోలీసులు ఆదేశాలిచ్చారని, వ్యాపారస్తులు, ప్రజల అవసరాలను పరిగణలోకి తీసుకొని రాత్రి 1 గంట వరకు అవకాశం కల్పించాలని కోరారు.

స్థానిక సంస్థల్లో కొత్త రిజర్వేషన్లు అమలు చేయాలి

జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి

హైదరాబాద్, డిసెంబర్16 (నమస్తే తెలంగాణ): స్థానికసంస్థల్లో కొత్త రిజర్వేషన్లను అమలు చేయాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర అధికారయంత్రాంగం కసరత్తు చేస్తున్నదని గుర్తుచేశారు. కాంగ్రెస్ తన ఎన్నికల ప్రణాళికలో స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రంలో అమలులో ఉన్న 23 శాతం బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చిందని, ఈ ఎన్నికల్లోనే ఉప కులాలవారీగా వర్గీకరణతో రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఆ తరువాతే పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని సూచించారు.

పడెకరాల లోపున్నవారికే రైతుబంధు ఇవ్వాలి

- నెహ్రూ, కేసీఆర్, సోనియా చరితార్థులు
- తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్
- మండలిలో ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

హైదరాబాద్, డిసెంబర్16(నమస్తే తెలంగాణ): పడెకరాల లోపు వ్యవసాయ భూములున్న రైతులకే ప్రభుత్వం రైతుబంధు అమలు చేయాలని ఎమ్మెల్సీ గోరటి వెంకన్న కోరారు. మండలిలో శనివారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చలో భాగంగా ఆయన మాట్లాడారు. వందలాది ఎకరాల భూములున్న వారికి, సినీ నటీనటులకు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు, ప్రభుత్వోద్యోగులకు రైతుబంధు ఇవ్వొద్దని తాను గతంలో చెప్పానని, ఇప్పుడూ అదే మాటపై ఉన్నానని స్పష్టం చేశారు. నెహ్రూ, కేసీఆర్, సోనియా చరిత్రలో నిలిచిపోయే వ్యక్తులని కొనియాడారు. 317 జీవోను తీసుకొచ్చి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అధికారులే బదనాం చేశారని ధ్వజమెత్తారు. అధికారులు కావాలనే కోదండరాం ఇంటి తలుపులు పగులగొట్టారని, హరగోపాల్ మీద ఉపా కేసు పెట్టారని మండిపడ్డారు. తన దృష్టిలో నిర్బంధం అంటే ఇంద్రవెల్లి ఘటన అని.. ఈ ప్రభుత్వం అలాంటి తప్పులు పునరావృతం చేయొద్దని హితవు పలికారు.

నిరుత్సాహంగా గవర్నర్ ప్రసంగం

- తెలంగాణలో కాంగ్రెస్ బలపడలేదు
- ఓట్లు చీలడం వల్లనే ఆ పార్టీ గెలిచింది
- మీడియాతో బీజేపీ ఎంపీ కే లక్ష్మణ్

హైదరాబాద్ సిటీ బ్యూరో, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం ఆశాజనకంగా లేదని బీజేపీ ఎంపీ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కే లక్ష్మణ్ అన్నారు. గవర్నర్ తమిళిసై ప్రసంగం వాస్తవానికి దూరంగా ఉన్నదని ఆరోపించారు. గవర్నర్ ప్రసంగంలో రైతు రుణమాఫీ, రైతుబంధు మాటలే లేవని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. వంద రోజుల అనంతరం కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతామని హెచ్చరించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటులో చీలిక వచ్చి కాంగ్రెస్ గెలిచిందితప్ప.. తెలంగాణలో ఆ పార్టీ బలపడలేదని అభిప్రాయపడ్డారు. మొదటి క్యాబినెట్ సమావేశంలోనే మెగా డీఎస్సీపై ప్రకటన చేస్తామని చెప్పారని, కానీ దానిపై స్పష్టత లేదని విమర్శించారు.

శనివారం మండలి మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత. చిత్రంలో ఎమ్మెల్సీలు సత్యవతి, ఎమ్మెస్ ప్రభాకర్, తాతా మధు, ఎంసీ కోటిరెడ్డి

ఆపదాలను తొలగించాలి

- గవర్నర్ ప్రసంగంలోని పదాలపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అభ్యంతరం
- మండలి చైర్మన్‌కు లిఖితపూర్వక విజ్ఞప్తి

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): గవర్నర్ ప్రసంగంలోని పలు అంశాలపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అభ్యంతరం వ్యక్తంచేశారు. అభ్యంతరకరమైన వ్యాఖ్యలను రికార్డుల్లోంచి తొలగించాలని శాసనమండలిలో కవిత సవరణను ప్రతిపాదిస్తూ మండలి చైర్మన్‌కు రాతపూర్వకంగా విజ్ఞప్తి చేశారు. 'విముక్తి', 'అణచివేత', 'నియంతృత్వ పాలన', 'వ్యవస్థల విధ్వంసం', 'వివక్ష' వంటి పదాలను తొలగించాలని సవరణను ప్రతిపాదించారు. శనివారం మండలి మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, ఎమ్మెస్ ప్రభాకర్, తాతా మధు, ఎంసీ కోటిరెడ్డితో కలిసి కవిత మాట్లాడారు. రెండుసార్లు ప్రజలు ఓట్లు వేస్తేనే భారీ మెజారిటీతో గెలిచిన ప్రభుత్వాలమీద విపరీతమైన వ్యాఖ్యలు గవర్నర్ ప్రసంగంలో చేయడం అందరినీ బాధించిందని అన్నారు. మండలిలో బీఆర్ఎస్‌కే మెజార్టీ ఉన్నప్పటికీ, ప్రభుత్వానికి సహకరించాలని.. తద్వారా ప్రజలకు ఒక మంచి సందేశం ఇవ్వాలనే ఉద్దేశంతో గవర్నర్ ప్రసంగంలో ఉన్న అంశాలకు తాము చేసిన అమెండ్‌మెంట్‌ను విత్‌డ్రా చేసుకున్నామని వివరించారు. తెలంగాణ ప్రజలకు నష్టం జరిగే ఎలాంటి నిర్ణయం జరిగినా కచ్చితంగా ప్రజల పక్షాన పోరాటం చేస్తామని కవిత స్పష్టంచేశారు.

ఎన్నారైలకు రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

- బీఆర్ఎస్ ఎన్నారై గ్లోబల్ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల

ఎన్నారైలకు అవమానం: ఎన్నారై బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్

హైదరాబాద్, డిసెంబర్16 (నమస్తే తెలంగాణ): ఎన్నారై అంటే.. నాన్ రిలయబుల్ ఇండియన్ అని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడాన్ని బీఆర్ఎస్ ఎన్నారై గ్లోబల్ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల ఖండించారు. ఎన్నారైలు అంటే నాన్ రెసిడెంట్ ఇండియన్స్ అని శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నారైలు దేశఆర్థిక వ్యవస్థకు అండగాఉంటున్నారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, అసెంబ్లీ రికార్డుల నుంచి తొలగించాలని కోరుతున్నట్టు పేర్కొన్నారు. అసెంబ్లీ సాక్షిగా ఎన్నారైలను అవమానపరుస్తూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల్ని ఎన్నారై బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎఫ్డీసీ మాజీ చైర్మన్ అనిల్ కూర్మాచలం ఖండించారు. వెంటనే ఎన్నారైలకు సీఎం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటనను విడుదల చేశారు. రేవంత్‌రెడ్డికి రాజకీయంగా అవసరం ఉన్నప్పుడు ఎన్నారైలు గొప్పగా కనిపిస్తారని, అవసరం తీరాక అహంకారంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

సీఎం రేవంత్‌తో జైరాంరమేశ్, కృష్ణయ్య భేటీ

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డితో కేంద్ర మాజీ మంత్రి, ఏఐసీసీ నేత జైరాం రమేశ్, ఎంపీ ఆర్ కృష్ణయ్య శనివారం భేటీ అయ్యారు. శాసనసభకు వచ్చిన వారిద్దరూ మర్యాదపూర్వకంగా సీఎంని కలిసి అభినందనలు తెలిపారు. రాష్ట్ర రాజకీయాలు, ఇటీవల జరిగిన ఎన్నికల గురించి సీఎంతో జైరాంరమేశ్ కొద్దిసేపు ముచ్చటించారు. బీసీ రిజర్వేషన్లు, ఇతర సమస్యల పరిష